గుకేశ్‌కు ఘన స్వాగతం

చెన్నై: ఇటీవలే కెనడాలోని టొరంటో వేదికగా ముగిసిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ గురువారం స్వదేశానికి తిరిగొచ్చాడు. చెన్నై విమానాశ్రయంలో అతడికి ఘన స్వాగతం లభించింది. స్వాగత సత్కారాల తర్వాత గుకేశ్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. 'విష్షీ సార్ (విశ్వనాథన్ ఆనంద్) సార్ నాకు చాలా స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఆయన అకాడమీలో చేరడంతో నేను చాలా మెరుగయ్యాను. ఆయన లేకుంటే ప్రస్తుతం నేను ఉన్న స్థితికి దరిదాపుల్లో కూడా ఉండేవాడిని కాను..' అంటూ ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. చెన్నైలోని ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెస్ట్‌బ్రిడ్జ్–ఆనంద్ చెస్ అకాడమీ (వాకా)లో గుకేశ్ 2020 నుంచి శిక్షణ పొందుతున్నాడు.

ఫైనల్ చేరిన భారత రికర్వ్ టీమ్

ఆర్చరీ వరల్డ్ కప్

షాంఘై: చైనాలోని షాంఘై వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ –1 టోర్నీలో భాగంగా గురువారం ముగిసిన పురుషుల రికర్వ్ ఆర్చరీ ఈవెంట్‌లో భారత జట్టు ఫైనల్ చేరింది. తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ఆటగాడు ధీరజ్ బొమ్మదేవరల త్రయం ఇటలీని 5–1 తేడాతో చిత్తు చేసింది. ఫైనల్‌లో భారత్.. దక్షిణకొరియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఇదే టోర్నీలో భాగంగా భారత పురుషుల, మహిళల కాంపౌండ్ జట్లు ఇదివరకే ఫైనల్ చేరాయి.

క్రికెట్‌కు బిస్మా మరూఫ్ వీడ్కోలు

లాహోర్: పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు మాజీ సారథి బిస్మా మరూఫ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2006 నుంచి ఆ జట్టు తరపున ఆడుతున్న మరూఫ్.. ఇటీవలే వెస్టిండీస్‌తో ముగిసిన వన్డే సిరీస్‌లో చివరిసారిగా ఆడింది. 15 ఏండ్లకే పాక్ జట్టులో అరంగేట్రం చేసిన ఆమె తన 18 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో 276 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 6,262 పరుగులు చేయడమే గాక బౌలింగ్‌లో 80 వికెట్లు పడగొట్టింది. పాక్ తరపున వన్డేలు, టీ20లలో అత్యధిక పరుగులు (ఉమెన్స్ క్రికెట్‌లో)చేసిన రికార్డు ఆమె పేరిటే ఉంది. 34 వన్డేలు, 62 టీ20లలో ఆమె పాక్ జట్టుకు సారథిగా వ్యవహరించింది.

జింబాబ్వే మాజీ క్రికెటర్‌పై చిరుత దాడి

- కాపాడిన పెంపుడు కుక్క

హరారే: జింబాబ్వే మాజీ ఆల్‌రౌండర్ గైవిట్టాల్ చిరుత దాడిలో తీవ్ర గాయాలపాలయ్యాడు. హ్యూమని ప్రాంతం లో తన పెంపుడు కుక్క (చికారా)తో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన అతడిపై ఓ చిరుత మెరుపు దాడి చేసింది. అయితే అతడితో ఉన్న చికారా.. ప్రాణాలకు తెగించి చిరుతతో పోరాడి విట్టాల్‌ను రక్షించడమే గాక దానిని తరిమికొట్టింది. తీవ్రగాయాలపాలైన చికారాతో పాటు విట్టాల్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఆయన భార్య ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా వెల్లడించింది.

హైదరాబాద్‌కు షాకిచ్చిన ఆర్సీబీ

రైజర్స్‌కు ఝలక్

ఆరు పరాజయాల తర్వాత బెంగళూరుకు ఓ విజయం • అర్ధ సెంచరీలతో రాణించిన కోహ్లీ, పాటిదార్

ఐపీఎల్–17 సీజన్‌లో వరుసగా నాలుగు విజయాలతో దూసుకుపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) కు ఊహించని ఝలక్ తగిలింది. మొదట బ్యాటింగ్‌చేస్తూ బౌండరీలు, సిక్సర్లు బాదడం అంటే ఇంత ఈజీగా అన్నంత రేంజ్‌లో బాదుతున్న హైదరాబాద్.. ఛేదనలో మాత్రం చేతులెత్తేసింది. 'టార్గెట్ 300' అంటూ స్టేట్‌మెంట్‌లు ఇచ్చిన మన వీరులు.. ఛేదనలో 207 కొట్టడానికి నానా తంటాలు పడ్డారు. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ విఫలమై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చేతిలో చిత్తయ్యారు. మరోవైపు ఈ సీజన్‌లో చెత్త ప్రదర్శనలతో అభిమానుల ఆగ్రహానికి గురవుతున్న ఆర్సీబీ వరుసగా ఆరు పరాజయాల తర్వాత ఎట్టకేలకు గెలుపు రుచిచూసింది. ప్లేఆఫ్స్ రేసు నుంచి దాదాపుగా నిష్క్రమించిన ఆ జట్టు ఉప్పల్‌లో పోరాడితే పోయేదేమీ లేదన్నట్టుగా చెలరేగింది. ఐపీఎల్‌లో 250వ మ్యాచ్ ఆడిన ఆర్సీబీ.. ఈ సీజన్‌లో తమ అత్యధిక పరుగుల రికార్డు (263) రికార్డును మూడుసార్లు చెరిపేసిన ఎస్‌ఆర్‌హెచ్‌ను వారి సొంత ఇలాఖా ఉప్పల్‌లో ఓడించి బదులు తీర్చుకుంది. ముందు బ్యాటింగ్‌లో రజత్ పాటిదార్ మెరుపులకు తోడు కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌తో బెంగళూరు '200' మార్కును దాటింది. ఆర్సీబీ స్పిన్నర్లు హైదరాబాద్‌ను ఆరంభం నుంచే కోలుకోలేని దెబ్బకొట్టి బెంగళూరు 'బెంగ' తీర్చారు.

పాటిదార్ (50)

సినీ హీరో వెంకటేశ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, వంశీ పైడిపెల్లి, సంగీత దర్శకుడు తమన్, ఎంపీ అనిల్‌కుమార్, సీఎం రేవంత్ రెడ్డి కూతురు నైమిషలు మ్యాచ్‌ను వీక్షించారు.

స్టేడియంలో అభిమానుల కోలాహలం

స్టేడియానికి హాజరైన ప్రేక్షకులు

35,806

హైదరాబాద్ : వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి ఊపు మీదున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఝలక్ ఇచ్చింది. సొంతగడ్డ ఉప్పల్‌లో హైదరాబాద్‌ను 35 పరుగుల తేడాతో చిత్తు చేసి ఎట్టకేలకు ఆరు పరాజయాల తర్వాత ఓ విజయాన్ని నమోదుచేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సమిష్టిగా రాణించి ఎస్‌ఆర్‌హెచ్‌పై రివేంజ్ తీర్చుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరుకు కోహ్లీ (43 బంతుల్లో 51, 4 ఫోర్లు, 1 సిక్స్), రజత్ పాటిదార్ (20 బంతుల్లో 50, 2 ఫోర్లు, 5 సిక్సర్లు), కామెరూన్ గ్రీన్ (20 బంతుల్లో 37 నాటౌట్, 5 ఫోర్లు) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో హైదరాబాద్.. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 171 పరుగుల వద్దే ఆగిపోయింది. షాబాజ్ అహ్మద్ (37 బంతుల్లో 40 నాటౌట్, 1 ఫోర్, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా అభిషేక్ శర్మ (13 బంతుల్లో 31, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆర్సీబీ స్పిన్నర్లు స్వప్నిల్ సింగ్ (2/40), కర్ణ్ శర్మ (2/29) ఎస్‌ఆర్‌హెచ్‌ను కట్టడిచేశారు. పాటిదార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

కోహ్లీ క్లాస్.. పాటిదార్ మెరుపులు..

టాస్ గెలిచిన బెంగళూరు సారథి మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ తీసుకోవడంతోనే ఆర్సీబీ భారీ స్కోరుపై కన్నేసిందని తేలిపోయింది. అందుకు తగ్గట్టుగానే ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసిస్ (12 బంతుల్లో 25, 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఆరంభాన్నిచ్చారు. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీగా మలిచిన కోహ్లీ.. కమిన్స్ మూడో ఓవర్లోనూ రెండు ఫోర్లు కొట్టాడు. ఉన్నది తక్కువసేపే అయినా డుప్లెసిస్ 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో విరుచుకుపడ్డాడు. 4వ ఓవర్లో నటరాజన్ రంగప్రవేశంతో డుప్లెసిస్ కథ ముగిసి 48 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వన్ డౌన్‌లో వచ్చిన విల్ జాక్స్ (6)ను మార్కండే అద్భుత బంతికి బౌల్డ్ చేశాడు. కానీ ఆ తర్వాత వచ్చిన పాటిదార్.. హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మార్కండే వేసిన 11వ ఓవర్లో వరుసగా నాలుగు సిక్సర్లతో ఆర్సీబీ స్కోరు బోర్డు రాకెట్ వేగాన్ని అందుకుంది. కోహ్లీ కూడా అతడికి అండగా నిలిచాడు. అయితే 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న పాటిదార్ 13వ ఓవర్ వేసిన ఉనద్కత్ బౌలింగ్‌లో అబ్దుల్ సమద్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆర్సీబీ స్కోరువేగం మందగించింది. 37 బంతుల్లోనే అర్ధ శతకం చేసిన కోహ్లీ కూడా ఉనద్కత్ బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరాడు. ఆఖర్లో కామెరూన్ గ్రీన్ పరుగులు పెట్టించాడు. కార్తీక్ (11), స్వప్నిల్ (12 నాటౌట్) తలా ఓ చేయి వేసి ఆ జట్టు స్కోరును 200 మార్కును దాటించారు.

కోహ్లీ (51)

తడబడ్డ రైజర్స్..

భారీ ఛేదనలో సన్‌రైజర్స్ ఆదిలోనే తడబడింది. తొలి ఓవర్లోనే వికెట్ కోల్పోవడంతో హైదరాబాద్ తర్వాత ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. క్రీజులోకి వచ్చినోళ్లు వచ్చినట్టే వెనుదిరిగారు.ట్రావిస్ హెడ్ (1).. విల్ జాక్స్ వేసిన తొలి ఓవర్లో ఆఖరి బంతికి కర్ణ్ శర్మకు క్యాచ్ ఇచ్చాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం ధాటిగా ఆడే క్రమంలో మూడో ఓవర్లో 4, 6, 6తో 20 పరుగులు రాబట్టినా దయాల్ 4వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి కార్తీక్‌కు చిక్కాడు. స్వప్నీల్ సింగ్ ఒకే ఓవర్లో మార్క్‌రమ్ (7), హైదరాబాద్ భారీ ఆశలు పెట్టుకున్న హెన్రిచ్ క్లాసెన్ (7)ను పెవిలియన్‌కు పంపి భారీ దెబ్బకొట్టాడు. మరో ఆర్సీబీ స్పిన్నర్ కర్ణ్ శర్మ వరుస ఓవర్లలో హైదరాబాద్ కష్టాలను మరింత రెట్టింపుచేశాడు. 8వ ఓవర్లో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి (13) న్ని క్లీన్‌బౌల్డ్ చేసిన అతడు పదో ఓవర్లో అబ్దుల్ సమద్ కూడా బోల్తా కొట్టించడంతో విజయంపై ఎస్‌ఆర్‌హెచ్ ఆశలు అడుగంటాయి. కమిన్స్ (31)కు గ్రీన్ చెక్ పెట్టాడు. షాబాజ్ అహ్మద్ పోరాడినా అతడి పోరాటం హైదరాబాద్ ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	8	7	1	0.69	14
కోల్‌కతా	7	5	2	1.20	10
హైదరాబాద్	8	5	3	0.57	10
లక్నో	8	5	3	0.14	10
చెన్నై	8	4	4	0.41	8
ఢిల్లీ	9	4	5	-0.38	8
గుజరాత్	9	4	5	-0.97	8
ముంబై	8	3	5	-0.22	6
పంజాబ్	8	2	6	-0.29	4
బెంగళూరు	9	2	7	-0.72	4

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 206/7 (కోహ్లీ 51, పాటిదార్ 50, ఉనద్కత్ 3/30, నటరాజన్ 2/39)

హైదరాబాద్: 20 ఓవర్లలో 171/8 (షాబాజ్ 40 నాటౌట్, అభిషేక్ 31, గ్రీన్ 2/12, కర్ణ్ శర్మ 2/29)

ఇక కేంద్రం దయ?

మొదటిపేజీ తరువాయి...

పంటలు పండుతున్నాయనేది సత్యమైతే, పునరుద్ధరణ పనులు ఎందుకు చేపట్టడం లేదు? కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు, అవినీతి జరిగిందంటూ ఏకకాలంలో వివిధ మార్గాల్లో విచారణలు చేయిస్తున్న కాంగ్రెస్ సర్కార్ మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ అంశాన్ని గాలికి వదిలేసింది. ఎన్‌డీఎస్‌ఏ దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టింది. నివేదిక వస్తే తప్ప ఏ చిన్న అడుగు వేయబోమంటూ భీష్మించుకుని కూర్చున్నది. తాత్కాలిక మరమ్మతులకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కోరి, చేతులు దులుపుకున్నదే తప్ప ఆ దిశగా పటిష్టమైన చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది వానలు ముందే కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ సూచిస్తున్నా, కనీస ఎమర్జెన్సీ పనులను సైతం చేపట్టడం లేదు. ఎన్‌డీఎస్‌ఏ సైతం అదే తీరుగా వ్యవహరిస్తున్నది. బరాజ్ కుంగుబాటు తరువాత రెండు రోజుల్లోనే నివేదిక విడుదల చేసిన అథారిటీ, ఇక ఆ తరువాత విచారణలతోనే కాలం గడుపుతున్నది తప్ప రాష్ట్రానికి మరే సమాచారమూ ఇవ్వడం లేదు. ఎన్డీఎస్‌ఏ తీరుపై ఇంజినీరింగ్ అధికారులు, సర్కారు వ్యవహారంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మేడిగడ్డపై నాడు అత్యుత్సాహం

మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ గత అక్టోబర్‌లో కుంగుబాటునకు గురైన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆది నుంచీ అక్కసు వెళ్లగక్కుతున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నది. విచారణ చేయకముందే డిజైన్ లోపాలు, నాణ్యతా లోపాలు అంటూ నానా రచ్చ చేసింది. మంత్రులు ఒకసారి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ప్రాజెక్టును సందర్శించి అక్కడా అవే ఆరోపణలు చేశారు. అక్కడితో ఆగకుండా అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయడంతోపాటు ఒకవైపు విజిలెన్స్ ఎంక్వయిరీకి, మరోవైపు జ్యూడిషియల్ ఎంక్వయిరీకి ఆదేశించారు. ప్రాజెక్టు పునరుద్ధరణ అంశాన్ని మాత్రం ఎన్‌డీఎస్‌ఏ దయాదాక్షిణ్యాలకు వదిలేశారు. ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరమే ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను చేపడతామంటూ ప్రభుత్వం భీష్మించుకుని కూర్చున్నది. క్షేత్రస్థాయి పరిస్థితులను, తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే వాటిల్లే ఇబ్బందులను ఎన్డీఎస్‌ఏకు వివరించి నివేదికను తెప్పించుకునే ప్రయత్నమే చేయకపోవడం ప్రభుత్వ ఉదాసీనతకు నిదర్శనం.

తక్షణ మరమ్మతులపై దృష్టిసారించని ప్రభుత్వం

మేడిగడ్డ బరాజ్ వద్ద కుంగుబాటును సరిచేసి, శాశ్వత మరమ్మతులను డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు చేయాల్సి ఉంటుంది. రాబోయే వానకాలం దృష్ట్యా, పిల్లర్ వద్ద ఏర్పడిన కుంగుబాటు మరింత విస్తరించకుండా ఉండేందుకు అవసరమైన మేరకు తాత్కాలిక, తక్షణ చర్యలను చేపట్టాల్సి ఉన్నది. అన్ని బరాజ్‌ల్లో రాఫ్ట్ కిందనున్న రంధ్రాలను గుర్తించి వాటిని మూసివేయడం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ఓఅండ్‌ఎం పనులను ఐఎస్ కోడ్ ప్రకారం చేపట్టేందుకు నిర్మాణ సంస్థలకు అవకాశం కల్పించడం, బరాజ్‌ల ఎగువన, దిగువన వాటర్ ప్రూఫ్ కోసం సిమెంట్ గ్రౌటింగ్ చేపట్టడం, ప్రవాహాలకు ఆటంకంగా మారే రాళ్లను తొలగించడం, మేడిగడ్డలో బ్లాక్ 7లో జామ్ అయిన గేట్లను తొలగించడం, స్టీల్‌షీట్‌పైల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయడం, బరాజ్‌లపై వరద ఒత్తిడిని తగ్గించేందుకు ఎగువ భాగంలో నదిపై రెగ్యులేటరీలు నిర్మించడం, బరాజ్‌ల ఎగువ, దిగువన నదీ గర్భంలోని ఇసుక మేటలను ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షణలో తొలగించడం తదితర పనులను నిర్వహించాల్సి ఉన్నది. ఆయా అంశాలనే ప్రభుత్వం సైతం ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి వివరించింది. అక్కడితోనే ప్రభుత్వం చేతులు దులుపుకున్నది తప్ప ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నుంచి మధ్యంతర నివేదికను తెప్పించుకునేందుకు చేసిన ప్రయత్నమేదీ ఇప్పటివరకు కనిపించడం లేదు. నివేదిక ఇస్తే తప్ప పూచికపుల్ల పనిని కూడా చేపట్టబోమని రాష్ట్ర ప్రభుత్వం తెగేసి చెప్తున్నది.

ఎన్‌డీఎస్‌ఏదీ అదే తీరు

మేడిగడ్డ బరాజ్‌లోని 20వ పిల్లర్ అక్టోబర్ 21న కుంగుబాటుకు గురైన వెంటనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం, ఎన్‌డీఎస్‌ఏ ఆగమేఘాల మీద ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తోసహా ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటుచేసింది. ఆ బృందం అక్టోబర్ 23న రాష్ట్రానికి వచ్చింది. 24న మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించింది. అదే నెల 25న రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు, ప్రాజెక్టు అధికారులు, బరాజ్ నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమైంది. మరో 20 సాంకేతిక అంశాలపై సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించింది. ఆ సమాచారాన్ని రాష్ట్ర అధికారులు ఇవ్వకముందే, అక్టోబర్ 29 నాటికే కాళేశ్వరం బరాజ్ ఘటనపై ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. ఎలాంటి పరీక్షలు, పరిశోధనలు చేయకుండా, కేవలం క్షేత్రస్థాయి సందర్శన ద్వారానే బరాజ్ కుంగుబాటుకు డిజైన్, నాణ్యత లోపాలు కారణమంటూ ఎన్‌డీఎస్‌ఏ ప్రకటించింది. ఆ తరువాత మార్చి వరకు ఎన్‌డీఎస్‌ఏ మళ్లీ స్పందించింది లేదు. అంతర్జాతీయ నిపుణులతో కమిటీని ఏర్పాటుచేసుకోవాలని, పరిశీలనలు చేసుకోవాలని ఉచిత సలహాలు ఇచ్చింది తప్ప పూర్తిస్థాయి విచారణ చేపట్టి, పునరుద్ధరణ చర్యలకు సిఫారసు చేసేందుకు మాత్రం ముందుకురాలేదు. ఎట్టకేలకు గత మార్చి 3న చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని ఎన్‌డీఎస్‌ఏ నియమించింది. నివేదిక సమర్పణకు నాలుగు నెలల గడువు ఇచ్చింది. ఆ కమిటీ తొలుత మార్చి 7,8,9 తేదీల్లో విచారణ చేసింది. ఆ తరువాత మార్చి 20,21,22 తేదీల్లో మరోసారి విచారణ నిర్వహించింది. కానీ ఇప్పటికీ తక్షణ, తాత్కాలిక చర్యలకు సంబంధించి ఎలాంటి సిఫారసులు చేయలేదు.

ఎన్‌డీఎస్‌ఏ అనుభవం ఏమిటి?

ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు చేసిన తరువాతనే తక్షణ మరమ్మతులు చేపడతామంటూ ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోవడంపై ఇంజినీరింగ్ అధికారులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీనే ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదని, అందులో ఉన్నవారందరూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారేనని చెప్తున్నారు. సీడబ్ల్యూసీలో ఇంజినీర్ల కొరత ఉన్నదని, పని ఒత్తిడితో వారే సతమతమవుతున్నారని, ఇప్పటికిప్పుడు అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వడం కష్టమేనని అంటున్నారు. ఎన్‌డీఎస్‌ఏలోని అధికారులకు భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొన్న క్షేత్రస్థాయి అనుభవమే లేదని స్పష్టంచేస్తున్నారు. ప్రాజెక్టుపై ప్రభుత్వ ఉదాసీనతను తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ప్రాజెక్టుల్లో లోపాలు సహజమని వాటిని విచారించి చర్యలు తీసుకోవడంతోపాటు పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుందని వివరిస్తున్నారు. వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మేడిగడ్డ పునరుద్ధరణపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతాంగంలోనూ తీవ్ర ఆగ్రహం

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో రైతాంగంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు లేని లోటును గోదావరి బేసిన్‌లోని రైతులు స్వయంగా అనుభవిస్తున్నారు. నిరుడు యాసంగి సీజన్‌లో పచ్చగా కళకళలాడిన పంటపొలాలు ఈ ఏడాది యాసంగిలో ఎండిపోయి పశువులకు మేతగా మారడంతో కన్నీటిపర్యంతమవుతున్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి పెట్టకుండా, రాజకీయాలకే పరిమితం కావడంపై నిప్పులు చెరుగుతున్నారు. ఇటీవల కొందరు రైతులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించుకునైనా ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టుకుందామని పిలుపునిస్తుండటం గమనార్హం. ఇకనైనా రాజకీయాలు మానుకుని జాతి సంపదను కాపాడాలని, వచ్చే సీజన్‌కైనా ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చే విషయంపై దృష్టి సారించాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నది.